

నేడు మృగశిర కార్తె
వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభం కానుంది.
- 8లో ▸



హాల్ టికెట్లు పరిశీలించాలి
గ్రూప్‌-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.9 /26.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేస్తాం



బోధన్‌టౌన్: నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేస్తామని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి తుకారం రాథోడ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి మాట్లాడుతూ ఐఎంఏ నిబంధనలను పాటించకుండా ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, సూపర్ వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

రుద్రూర్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. కోటగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రుద్రూర్, పోతంగల్ పీహెచ్‌సీలు, ఎత్తొండ, అక్బర్ నగర్ సీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో..

బాల్కొండ: శ్రీరాంసాగర్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులోకి 1157 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కాగా సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి కోసం 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 241 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1056.10 అడుగుల(6.39 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

సొసైటీకి తాళం వేసిన రైతులు



రుద్రూర్: ధాన్యం విక్రయించిన డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారని కోటగిరి మండలం ఎత్తొండ సింగిల్ విండోకు రైతులు శుక్రవారం తాళం వేసి ఆందోళన చేశారు. సంఘం ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్నా బకాయిలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం పరిధిలోని సుమారు 114 మంది రైతులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి ఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడి బకాయిలు చెల్లించేలా చూస్తామన్నారు.

చిన్నారి ప్రాణాలను బలిగొన్న కూలర్



ఆర్మూర్‌టౌన్: వేసవిలో చల్లదనం కోసం ఏర్పాటు చేసుకున్న కూలర్ చిన్నారి పాలిట మృత్యువుగా మారింది. నిజామాబాద్ నగరంలో నివాసముండే సౌందర్య, మనీష్ దంపతులు ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తారు. వీరు పని మీద ఊరెళ్లడంతో వారి కుమార్తెలు మధుర, సిందూర(6)లను గురువారం ఆలూర్‌లోని అమ్మమ్మ లావణ్య వద్ద వదిలి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఆడుకుంటున్న సిందూర కూలర్‌ను తాకింది. విద్యుత్ సరఫరా కావడంతో చిన్నారి తీవ్రగాయాలపాలైంది. వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదే విధంగా 15 రోజుల క్రితం నిజామాబాద్‌కు చెందిన చిన్నారి శృతిక పెర్కిట్‌లోని అమ్మమ్మ ఇంటికి సెలవుల్లో వచ్చి కూలర్ షాక్‌తోనే మృతి చెందిన విషయం తెలిసిందే.

ఇక యథావిధిగా ప్రజావాణి

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

సక్సెస్ వెనుక సమన్వయం

ఇందూరు పార్లమెంట్ స్థానంలో బీజేపీ విజయం వెనుక ఆ పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ కృషి ఎంతో ఉంది. గత శాసనసభ ఎన్నికలను పోలిస్తే ఈ ఎన్నికల్లో పార్టీకి ఏకంగా రెండు లక్షలకు పైగా ఓట్లు పెరిగాయి. కాంగ్రెస్ శ్రేణులు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం గట్టిగానే కృషి చేసినప్పటికీ కొన్ని సెగ్మెంట్లలో సమన్వయ లోపంతో ఫలితం దక్కలేదు. ఇక బీఆర్‌ఎస్ భారీ మొత్తంలో ఓట్లు కోల్పోయింది. ఈ పార్టీ ఓట్లను కమలం పార్టీ కొల్లగొట్టింది.



- జీజేపీకి తిరుగులేని విజయం
- ఫలించిన పార్టీ పార్లమెంట్ సమన్వయ కమిటీ కృషి
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2.26 లక్షల ఓట్లు అధికం
- 'పల్లె' పాత్రపై అర్వింద్ ప్రశంస
- ఓట్లు పెరిగినా ఓటమిపాలైన కాంగ్రెస్
- ఓట్లు కోల్పోయి చతికిలపడ్డ బీఆర్‌ఎస్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు పార్లమెంట్ స్థానంలో వరుసగా రెండోసారి పాగా వేసిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ 2019తో పోలిస్తే ఈసారి ఘనవిజయం దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో 70,267 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా, 2024 ఎన్నికల్లో ఏకంగా 1,09,241 ఓట్ల ఆధిక్యత సాధించారు. అర్వింద్‌కు 2019లో మొత్తం 4,79,348 ఓట్లు రాగా, తాజా ఎన్నికల్లో 5,92,318 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా 2023 శాసనసభ ఎన్నికల్లో పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో కలిపి బీజేపీకి 3,65,374 ఓట్లు వచ్చాయి. ఐదు నెలల తేడాతో బీజేపీ ఏకంగా 2,26,944 ఓట్లు పెంచుకోవడం గమనార్హం. ఈ విజయం వెనుక పార్టీ నాయకుల సమన్వయ కృషి చాలా ఉంది. ఎంపీ అర్వింద్‌కు మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, తాజా పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ పల్లె గంగారెడ్డి ముఖ్య పాత్ర పోషించారు. పల్లె గంగారెడ్డి నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పార్టీ అధ్యక్షులు కులాచారి దినేశ్, మోరేపల్లి సత్యనారయణతో పక్కాగా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లారు. అదేవిధంగా ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు నుంచి ఆరుగురితో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీతోనూ నిరంతరం అనుసందానంగా ఉంటూ ప్రణాళికబద్ధంగా ప్రచారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కలిగి ఉన్న పల్లె గంగారెడ్డి సంఘ్‌పరివార్‌తోనూ పకడ్బందీగా సమన్వయం చేసుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్ ఓట్లను చీల్చి బీజేపీకి పడేలా చేయడంలోనూ సక్సెస్ సాధించారు. నామినేషన్ సమయంలో ఆర్మూర్‌లో నిర్వహించిన మూడు వేల మంది బూత్ కన్వీనర్ల సమావేశంలో పల్లె పాత్ర గురించి అర్వింద్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి..

గత శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా 3,14,997 ఓట్లను కోల్పోయింది. 2023 శాసనసభ ఎన్నికల్లో ఏడు సెగ్మెంట్లలో కలిపి బీఆర్‌ఎస్ 4,17,315 ఓట్లు, మూడు ఎమ్మెల్యే స్థానాలు దక్కించుకుని బీజేపీ, కాంగ్రెస్ కంటే ముందు నిలిచింది. అయితే ఐదు నెలల తేడాతో జరిగిన తాజా ఎన్నికల్లో మాత్రం కేవలం 1,02,318 ఓట్లు మాత్రమే సాధించడం గమనార్హం. ఏకంగా 3,14,997 ఓట్లు కోల్పోవడం గమనార్హం. బీఆర్‌ఎస్ కోల్పోయిన ఓట్లలో ఎక్కువ భాగం బీజేపీ కొల్లగొట్టింది. దీంతో బీజేపీ సిట్టింగ్ ఎంపీ అర్వింద్ ఘనవిజయం సాధించారు.

శ్రమించినా దక్కని ఫలితం

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తాటిపర్తి జీవన్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగానే కృషి చేసినప్పటికీ కొన్ని సెగ్మెంట్లలో ఆశించిన మేర సమన్వయం కుదరలేదు. దీంతో ఓట్లు పెరిగినప్పటికీ విజయానికి మాత్రం దూరంగా నిలిచిపోయారు.

2023 శాసనసభ ఎన్నికల్లో ఏడు సెగ్మెంట్ల పరిధిలో 4,08,135 ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లను 4,83,077కు పెంచుకుంది. 74,942 ఓట్లు అధికంగా దక్కించుకున్నా విజయం మాత్రం వరించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఐదు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయంపై ధీమా వ్యక్తం చేసిన కాంగ్రెస్‌కు ఫలితం దక్కలేదు. కొన్ని చోట్ల ఆశించిన స్థాయిలో సమన్వయం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో ఆది నుంచి పనిచేసిన వారిని కాకుండా బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వారిని ఇబ్బడిముబ్బడిగా చేర్చుకోవడంతో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని సీనియర్ నాయకులు అంటున్నారు. స్థానికంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలను, నాయకులను చేర్చుకున్నప్పటికీ, బీఆర్‌ఎస్ ఓటుబ్యాంక్‌ను కొల్లగొట్టడంలో మాత్రం విఫలమయ్యారు. దీంతో సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఓటమి చవిచూడాల్సి వచ్చింది.

కంబైన్డ్‌గా తనిఖీలు..!



సీజ్ చేసిన వాహనాలు

- ఆర్టీవో, పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల చెకింగ్
- ఒకే రోజు 128 వాహనాలు సీజ్
- దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, బైక్ దొంగతనాలకు చెక్ పెట్టేందుకు..
- జిల్లాలో వారంలో రెండు రోజుల పాటు తనిఖీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు, ఆర్టీవో అధికారులు కలిసి కంబైన్డ్‌గా తనిఖీలు చేపడుతున్నారు. నెంబర్ ప్లేట్ లేని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై అధికారులు దృష్టి సారించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో గురువారం నుంచి తనిఖీలు చేపట్టారు. కేవలం ఒక్క రోజే నిజామాబాద్‌లో 68, బోధన్‌లో 30, ఆర్మూర్‌లో 30 బైక్‌లను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. దీంతో పాటు బైక్‌లకు ఉన్న సీసీ నంబర్లను పరిశీలించి బైక్ వివరాలను ఆన్‌లైన్‌లో చెకింగ్ చేసి జరిమానాలు వేయగా ఎలాంటి ఆధారాలు లేని బైక్‌లను సీజ్ చేశారు.

నంబర్ ప్లేట్లు తీసేసి రోడ్లపైకి..

జిల్లాలో జరిగే దొంగతనాలు ఎక్కువగా బైక్‌లతో వివిధ వాహనాలతో జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటికి చెక్ పెట్టేందుకు సీపీ కల్మేశ్వర్ ఇటీవల పోలీసులు, రవాణాశాఖ అధికారులతో సమావేశమై కంబైన్డ్‌గా తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. దొంగలు ముందుగా బైక్‌లు, ఇతర వాహనాలను దొంగిలించి ఇళ్లలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలింది. చోరీలకు పాల్పడుతున్న దొంగలు బైక్‌లకు నంబర్ ప్లేట్లు తీసేసి రోజంతా రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఒంటరి మహిళలు కనబడితే చైన్‌స్నాచింగ్ చేస్తున్నారు. వీటిని నివారించడానికి పోలీసులు, ఆర్టీవో అధికారులు వారంలో రెండు రోజులు తనిఖీలు చేపట్టనున్నారు.

జరిమానాలు పడకుండా నంబర్ ప్లేట్ల తొలగింపు

పోలీసులు, ట్రాఫిక్ పోలీసుల బారి నుంచి జరిమానాలు పడకుండా వాహనాదారులు నంబర్ ప్లేట్లు లేని వాహనాలను నడుపుతున్నారు. జిల్లాలో ఎక్కువగా వాహనాలు నంబర్ ప్లేట్‌లేని వాహనాలు కనిపిస్తున్నాయి. వాహనాలకు అన్ని పత్రాలు ఉన్నా.. జరిమానాలు పడకుండా నెంబర్ ప్లేట్లు తొలగించి తిరుగుతున్నారు. మరికొందరు నంబర్ ప్లేట్లను వంచడం, స్టిక్కర్లను అతికించడం లాంటివి చేస్తున్నారు. వీటిని కూడా అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు.

తనిఖీలు కొనసాగుతాయి

వాహనాలకు నంబర్ ప్లేట్ లేనివి, పత్రాలు లేని వాటిని సీజ్‌చేస్తాం. దొంగతనాలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల్లో బైక్ నెంబర్ ప్లేట్ లేకపోవడం, నంబర్‌పై స్టిక్కర్లు, నంబర్ ప్లేట్‌లను వంచడంతో సీసీ కెమెరాల్లో గుర్తించిన దొంగలను పట్టుకోవడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో వాహనాల తనిఖీలు కంబైన్డ్‌గా కొనసాగుతాయి. – నారాయణ, ట్రాఫిక్ ఏసీపీ

అన్ని ధ్రువపత్రాలు ఉండాల్సిందే..

వాహనాల తనిఖీల్లో పోలీసులతో పాటు రవాణాశాఖ అధికారులు పాల్గొంటారు. వాహన పత్రాలను పరిశీలించి, వాటి వివరాలను పరిశీలిస్తాం. పత్రాలు లేని వాటిని పోలీసులు, ట్రాఫిక్ పోలీసులకు అప్పగిస్తాం. వారంలో రెండు రోజుల పాటు తనిఖీ కొనసాగిస్తాం. ఇక నిజామాబాద్ డివిజన్‌లో రోజు తప్పించి రోజు తనిఖీల్లో పాల్గొంటారు. – ఉమామహేశ్వర్‌రావు, జిల్లా రవాణా శాఖ అధికారి, నిజామాబాద్

చిక్కుతున్న పెద్ద చేపలు..

ఆనందంలో మత్స్యకారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 20 రోజుల నుంచి పెద్దపెద్ద చేపలు చిక్కుతున్నాయి. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం వేసిన విత్తన చేపపిల్లలు ప్రస్తుతం సుమారుగా 25 నుంచి 30 కిలోల వరకు పెరిగినట్లు మత్సకారులు చెబుతున్నారు. ప్రస్తుతం చేపలు మొత్తం పొట్టతో ఉన్నాయి. ఆ సహజ సిద్ధంగా పిల్లలు చేస్తే ఎస్సారెస్పీలో ఎన్నో చేప పిల్లలు ఉత్పత్తవుతాయి. జూన్ ఆఖరు వరకు మాత్రమే ఎస్సారెస్పీలో చేపల వేట సాగుతుంది. జూలై, ఆగస్టు మాసాల్లో చేపల వేట నిషేధం. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో పెద్దపెద్ద చేపలు చిక్కుతున్నాయి. పెద్ద చేపలను కిలోకు రూ. 140 కు వ్యాపారులు మత్స్యకారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. పదేళ్లలో ప్రస్తుత సంవత్సరమే ఇంత పెద్ద చేపలు చిక్కుతున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు ఒక్కొక్కరు మూడు క్వింటాళ్ల నుంచి నాలుగు క్వింటాళ్ల చేపలను వేటాడుతున్నట్లు తెలుపుతున్నారు. ప్రాజెక్టులో రెండేళ్లుగా పాప్లెట్ రకం చేపలు అధికంగా రావడంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బొచ్చ, రవు, బంగారు తీగ జాతి చేపలు అధికంగా చిక్కుతున్నాయి.



ఎస్సారెస్పీలో చిక్కిన పెద్ద చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల

నిజామాబాద్‌అర్బన్: టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో ఈనెల 10 నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలుపెట్టనున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో దరఖాస్తు, 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితా ప్రకటన, 14, 15 తేదీల్లో తుదిజాబితా ప్రచురణ, ఈనెల 16 నుంచి 20 వరకు ఎస్జీటీలకు పదోన్నతులు, 21 నుంచి 24 వరకు బదిలీల ప్రక్రియ జరుగనుంది.

'నాన్ లే అవుట్' రిజిస్ట్రేషన్..!

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లకు కాసుల వర్షం
- వెంచర్‌లో పది శాతం స్థలం అప్పగించకుండానే..
- నాలా కన్వర్షన్ ఆధారంగానే రిజిస్ట్రేషన్లు



సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఏరియా ఆధారంగా గజం చొప్పున రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారు. కేవలం నాలా కన్వర్షన్ ఆధారంగానే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. లే అవుట్ లేకపోవడంతో వెంచర్లలో 10 శాతం స్థలం కూడా పంచాయతీ, మున్సిపాలిటీలకు దక్కడం లేదు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు వెంచర్ యజమానులతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్లు చేస్తుండడంపై భారీగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్, రూరల్‌తో పాటు ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెలుగు చూస్తున్నాయి.

జిల్లాలో నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, నిజామాబాద్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఒకరిద్దరు మినహా మిగతా చోట్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతులు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆగస్టు 20, 2020 తర్వాత నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయొద్దని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినా అవే నిబంధనలు అమలవుతున్నాయి. కొత్త ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు.

నాన్ లే అవుట్ ప్లాట్లను..

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు రాజ్యమేలుతున్నారు. కొందరు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని డిచ్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్, మాక్లూర్ మండలాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో పలువురు రియల్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో కుమ్మక్కై నాన్ లేఅవుట్ వెంచర్లు చేస్తూ వాటికి అధిక ధరలకు అమ్ముకుని సామాన్యులను దోచుకుంటున్నారు. నాన్ లేఅవుట్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన అమాయకులు.. తర్వాత కాలంలో ఇళ్లు నిర్మించుకోవాలంటే అనుమతుల కోసం నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లపై ఫిర్యాదులు వస్తే మెమోలు జారీ చేయడం, సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

ఏసీబీ, విజిలెన్స్ నిఘా..!

రిజిస్ట్రేషన్ల శాఖలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ అధికారులు ఇప్పటికే నిఘా పెట్టారు. అతి త్వరలోనే ఈ శాఖపై ఏకకాలంలో దాడులు చేస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. ప్రభుత్వం కూడా శాఖలో జరుగుతున్న అవినీతి, రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఏసీబీ అధికారులు ఆర్‌టీఏ కార్యాలయాలు, చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేసి భారీగా డబ్బులు పట్టుకున్న విషయం తెలిసిందే.

డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై..

రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చడంలో రిజిస్ట్రేషన్ల శాఖ కీలకమైంది. అటువంటి శాఖ ఆదాయానికి సబ్ రిజిస్ట్రార్లు భారీగా గండి కొడుతున్నారు. వెంచర్ యజమానులు, డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నుడా నిబంధనలను తుంగలో తొక్కి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఏరియా ఆధారంగా గజం స్థలానికి ఇంత చొప్పున వసూలు చేస్తూ రూ. లక్షలు వెనకేసుకుంటున్నారు. లే అవుట్ లేని కారణంగా వెంచర్ చేసిన సమయంలో పది శాతం స్థలం స్థానిక జీపీ, మున్సిపాలిటీకి అప్పగించడం లేదు. ఆ స్థలంలో కూడా ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు.

మురికి కాల్వల్లో పూడిక పనులు చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నగరంలో మురికి కాల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గల మురికి కాల్వల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులను చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు మురికి కాల్వల్లో చేరి పూడిక వల్ల పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లోని మురికి కాల్వలను నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా మురికి కాల్వల్లో పేరుకుపోయిన పూడికతో పాటు చెత్తా, చెదారం తొలగించాలని సూచించారు. భారీ వర్షాలు కురవకముందే డీ–సిల్టింగ్ పనులను పూర్తి చేయించాలన్నారు. పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఈఈ ఆనంద్ సాగర్, డీఈ వాసుదేవ్, ఏఈలు ఇనాయత్, రవి తదితరులున్నారు.

శివాజీనగర్ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. నీటి వసతిని పెంపొందించేందుకు వీలుగా చేపడుతున్న పనుల నాణ్యతను తనిఖీ చేశారు. మరో నాలుగు రోజుల్లో బడులు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఈఈ దేవిదాస్, ఏఈ ఉదయ్ కిరణ్ తదితరులున్నారు.

నేడు లోక్ అదాలత్

ఖలీల్‌వాడి: జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి సునీతా కుంచాల ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లోక్‌అదాలత్ ప్రారంభోత్సవంలో సెకండ్ అడిషనల్ జడ్జి శ్రీనివాస్, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఆశాలత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ రాజేందర్‌రెడ్డి, జిల్లా బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్ పాల్గొనున్నారు.

జిల్లా వ్యవసాయాధికారితో నేడు సాక్షి ఫోన్‌ఇన్



విషయం: వర్షా కాలంలో ఏ సమయంలో విత్తనాలు, వరి నాట్లు వేయాలి. ఎరువులు, విత్తనాల లభ్యత, నకిలీ విత్తనాల సరఫరా, వరి నారుమడుల్లో సమస్యలు, తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడగవచ్చు.

తేది : 08-06-2024 (శనివారం)

సమయం: ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు..



వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

ఫోన్ చేయాల్సిన నంబర్ : 72888 94567 / 99594 12852

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బోధన్‌ టౌన్‌: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు బోధన్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. మే 31 నుంచి జూన్‌ 1 వరకు నిజామాబాద్‌లోని రాజారాం స్టేడియంలో అండర్‌–8, అండర్‌– 18 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో బోధన్‌కు చెందిన ఫిట్నెస్‌ అండ్‌ అథ్లెటిక్స్‌ క్లబ్‌ శిక్షణ సంస్థకు చెందిన విద్యార్థులు శ్రేయాన్స్‌, టి మోక్ష, శివస్నేహిత్‌ రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారని శిక్షణా సంస్థ నిర్వాహకుడు రెహాన్‌ తెలిపారు. ఈ నెల 6న హనుమకొండలో జరిగిన అండర్‌ –12 జావలింగ్‌త్రో కాంపిటేషన్‌లో విఘ్నేశ్వర్‌ రాష్ట్ర స్థాయిలో సిల్వర్‌ మెడల్‌ను సాధించినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న డిబార్ల పర్వం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో డిబార్ల పర్వం కొనసాగుతోంది. డిగ్రీ పరీక్షల్లో శుక్రవారం నాటికి మాల్‌ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ మొత్తం 24 మంది విద్యార్థులు డిబార్‌కు గురయ్యారు. వర్సిటీ పరిధిలోని 38 కేంద్రాల్లో శుక్రవారం ఉదయం జరిగిన డిగ్రీ ఆరో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలకు 6,086 మంది విద్యార్థులకు 5,670 మంది హాజరు కాగా 414 మంది గైర్హాజరు అయినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఒకటో సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు 3,050 విద్యార్థులకు 2,840 మంది హాజరయ్యారు. నిజామాబాద్‌లోని ఎస్‌ఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాల, ఆర్మూర్‌లోని నరేంద్ర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఒక్కొక్కరి చొప్పున ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్‌ అయినట్లు ఆయన తెలిపారు.

మాదిగల కవాతును విజయవంతం చేయాలి



నిజామాబాద్‌నాగారం: ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎంఆర్‌పీఎస్‌, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కవాతు మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకగా చూడాలన్నారు. నిజామాబాద్‌ ఎంపీగా గెలిచిన అర్వింద్‌కు అభినందనలు తెలిపారు. ఆయన గెలుపులో ఎంఆర్‌పీఎస్‌ పాత్ర ఉందన్నారు. సమావేశంలో కనక ప్రమోద్‌, మైలారం బాలు, సరికేల పోశెట్టి, రొడ్డ ప్రవీణ్‌, మానికోళ్ల గంగాధర్‌, యమున, సత్తెక్క, సుమన్‌, పద్మ, సావిత్రి, మునిరా, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి



నిజామాబాద్‌ నాగారం: మూడేళ్లు నిండిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్‌ పీడీ రసూల్‌బీ సూచించారు. శుక్రవారం నగరంలోని హమాల్‌వాడీ చౌరస్తాలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె ప్రారంభించారు. రసూల్‌ బీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో నందిని, సూపర్‌వైజర్‌, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు మృగశిర కార్తె

- జోరుగా చేపల విక్రయాలు
- ప్రారంభం కానున్న వ్యవసాయ పనులు



నిజామాబాద్‌లోని చేపల మార్కెట్‌లో సందడి



బోధన్‌లోని అచన్‌పల్లిలో చేపలు కొంటున్న ప్రజలు



బోధన్‌ రూరల్‌/నిజామాబాద్‌ రూరల్‌: వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభం కానుంది. జూన్‌లో వచ్చే ఈ కార్తెలో వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుడతారు. ఇన్నాళ్లు వేసవి తాపంతో ఇబ్బందులు పడ్డ జనం ఈ కార్తెలో కురిసే తొలకరి జల్లులతో ఉపశమనం పొందుతారు. ఈ కార్తె మొదటి రోజును మిరుగు(మిర్గం)గా జరుపుకుంటారు. ఈ రోజు చేపలు తినడం ఆనావాయితీ. అదేవిధంగా మామిడి పండ్ల రసాన్ని తాగుతారు. బియ్యం పిండితో అట్లు పోసుకుంటారు. రోహిణి కార్తె ముగిసి నేటి నుంచి ప్రారంభమయ్యే మృగశిర కార్తెతో ఎండలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో శరీర ఉష్ణోగ్రతలో మార్పులు జరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకోసం వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకునేందుకు మృగశిర కార్తె ప్రారంభంలో చేపలు తినడం మంచిదని పెద్దలు చెబుతారు. అయితే మిర్గం శనివారం రావడంతో ఆ రోజు మాంసం తినని వారు శుక్రవారమే పండుగ చేసుకున్నారు.

పెరిగిన ధరలు

మృగ శిర కార్తె నాడు చేపలకు మార్కెట్‌లో డిమాండ్‌ ఏర్పడింది. ప్రస్తుతం రెండు, మూడు చేపల ధర అమాంతం పెరిగిపోయాయి. బోధన్‌ మార్కెట్‌లో శుక్రవారం బొచ్చలు, బంగారు తీగ, రవట చేపలు కిలో రూ.150 నుంచి 300 వరకు ఉండగా మొట్ట చేపలు కిలో రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయించారు. మృగశిర కార్తె పురష్కరించుకుని చేపలు వ్యాపారులు సైతం ప్రత్యేక ఏర్పాట్లతో చేపలను విక్రయిస్తున్నారు. బోధన్‌లో ప్రత్యేకంగా మడులు ఏర్పాటు చేసి, ఆక్సిజన్‌ పెట్టి ప్రాణంతో ఉన్న చేపలను విక్రయిస్తున్నారు.

సాగుకు సన్నద్ధం

యాసంగి సీజన్‌ ముగిసి రెండు నెలలు గడుస్తుంది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌ ప్రారంభం కానున్న నేపథ్యంలో మృగశిర కార్తె సందర్భంగా రైతన్నలు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సన్నద్ధం అవుతున్నారు. మిర్గం తర్వాత తొలకరి కురవగానే దుక్కులు దున్నుతారు.



నగరంలో మామిడిపండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మంచి ధర వస్తుంది



మృగశిర కార్తె రోజు, మరుసటి రోజు చేపలకు మంచి గిరాకీ ఉంటుంది. ప్రతి ఏటా మృగశిర కార్తెకు కొంత ఖర్చుతో దుకాణం వద్ద నీటి మడులు ఏర్పాటు చేసి ఆక్సిజన్‌ పెట్టి ప్రాణంతో ఉన్న చేపలకు విక్రయిస్తాం. బంగారు తీగ, రవట చేపలు కిలో రూ.150 నుంచి రూ.300 వరకు ఉండగా మొట్ట చేపలు కిలో రూ.400 నుంచి రూ.600లకు పైగా ధర వస్తుంది. – అర్జున్‌, చేపల వ్యాపారి, బోధన్‌

రైతులకు ముఖ్యమైంది



రైతులకు మృగశిర కార్తె ఎంతో ప్రాముఖ్యమైంది. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పనులు ఈ రోజున ప్రారంభిస్తారు. రుతుపవానాల ఆగమనం, వర్షాలతో మృగశిర కార్తెలో వాతావరణం చల్లబడుతుంది. ఈ రోజున చేపలు తినడంతో పాటు మామిడి పండ్ల రసాన్ని తాగుతారు. – దేవేందర్‌, నగరవాసి

దోస్త్‌ తొలిదశలో 4,646 సీట్ల కేటాయింపు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టే దోస్త్‌లో తొలి దశ సీట్ల కేటాయింపు జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యామండలి గురువారం ప్రకటించింది. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఉన్న 61 డిగ్రీ కళాశాలల్లో మొత్తం 4,646 సీట్లు కేటాయించినట్లు వర్సిటీ అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ సంపత్‌ కుమార్‌ శుక్రవారం తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 7 నుంచి 12వ తేదీలోపు సంబంధిత కాలేజీల్లో రిపోర్టింగ్‌ చేయాలని సూచించారు. రూ.400 రుసుముతో దోస్త్‌ రెండో దశ రిజిస్ట్రేషన్లు, వెబ్‌ ఆప్షన్లు ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు చేసుకోవాలి. జూన్‌ 18న సీట్లు కేటాయించనున్నారు.



తెలంగాణ యూనివర్సిటీ పరిపాలనా భవనం

సీట్ల అలాట్‌మెంట్‌ వివరాలు..
(గురుకుల డిగ్రీ కాలేజీలు మినహాయించి)

యాజమాన్యం	కళాశాలలు	మొత్తం సీట్లు	కేటాయించిన సీట్లు
ప్రభుత్వ	08	2,880	212
ప్రభుత్వ(అటానమస్‌)	05	4,680	1,826
ప్రైవేట్‌	48	22,670	2,608
మొత్తం	61	30,230	4,646

అభ్యర్థుల హాల్‌ టికెట్లు పరిశీలించాలి

- గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌




సుభాష్‌నగర్‌: గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఐడెంటిఫికేషన్‌ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్‌ అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఐడెంటిఫికేషన్‌ అధికారులు 9న తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయం 7 గంటలకే చేరుకొని చీఫ్‌ సూపరింటెండెంట్‌కు రిపోర్ట్‌ చేయాలని సూచించారు. సీఎస్‌లతో సమన్వయం చేసుకుని సాఫీగా పరీక్ష నిర్వహణ కోసం అవసరమైన సహకారాన్ని అందించాలని హితవు పలికారు. హాల్‌ టికెట్‌పై ఇటీవల ఫొటో అతికించారా.. లేదా అన్నది గమనించాలన్నారు. ఫొటో అస్పష్టంగా ఉంటే, రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. చీఫ్‌ సూపరింటెండెంట్‌ మినహా మిగతా వారెవరూ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్‌ ఉపకరణాలను తీసుకెళ్లడానికి అనుమతి లేదని స్పష్టంచేశారు. డీఈవో దుర్గాప్రసాద్‌, డీఐఈవో రవికుమార్‌, విద్యాశాఖ ఏసీ విజయభాస్కర్‌ పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ వచ్చేనా!



సింగితం రిజర్వాయర్‌ అలుగు



బుంగ ద్వారా వృథాగా పోతున్న నీరు(ఫైల్‌)

- గత వానాకాలంలో దెబ్బతిన్న వైనం
- మరమ్మతులు చేపట్టని అధికారులు

నిజాంసాగర్‌: గత వానాకాలంలో దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు కరువయ్యాయి. జిల్లాలో 2,060 చెరువులు, కుంటలు ఉండగా వాటి కింద 1.19 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే గత వర్షాకాలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలకు వరద నీరు పోటెత్తడంతో 27 చెరువుల కట్టలు దెబ్బతిన్నాయి. తూములు వంకర్లు తిరగడం, బుంగలు పడ్డాయి. వానాకాలం ఆఖరి మాసం వరకు వర్షాలు కురవడంతో పంటలు గట్టెక్కాయి. చెరువులు, కుంటలు నిండిన బుంగలు, గండ్లు, తూములు చెడిపోడంతో నీరు వృథా అయింది. దీంతో ఆయా చెరువుల కింద యాసంగి పంటలు సాగుకు నోచుకోలేదు.

బుంగలతో నీరు వృథా

మహమ్మద్‌నగర్‌ మండలంలోని సింగితం రిజర్వాయర్‌కు నర్వ శివారులోని అలుగు వద్ద బుంగ పడింది. దీంతో నీరు వృథాగా పోయింది. రిజర్వాయర్‌ అలుగు బుంగపడటంతో మహమ్మద్‌ నగర్‌, నర్వ గ్రామాల ఆయకట్టు ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుంగ పడి నీరు వృథా కావడంతో మహమ్మద్‌నగర్‌ శివారులో ఆయకట్టు కింద పంటలు సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయినందునా చెరువులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం

గత వానాకాలంలో విస్తారంగా కురిసిన వర్షాలకు జిల్లాలో 27 చెరువులు దెబ్బతిన్నాయి. అందులో ఇప్పటి వరకు రూ.24 లక్షలు ఖర్చు చేసి 14 చెరువులను బాగు చేయించాం.ఇంకా 13 చెరువులకు రూ. 2.4 కోట్లు అవసరం ఉండగా టెండర్‌ ప్రక్రియ చేపట్టాం. వాటిని కుడా త్వరలోనే బాగు చేయిస్తాం. – శ్రీనివాస్‌, నీటిపారుదలశాఖ సీఈ

గండ్లను పూడ్చాలి



సింగితం రిజర్వాయర్‌ అలుగు వద్ద పడ్డ పెద్ద బుంగలను పూడ్చి వేస్తేనే ఆయకట్టు పంటలకు నీళ్లు అందుతాయి. వానాలు పడి రిజర్వాయర్‌ నిండినా బుంగలు నీళ్లను ఖాళీ చేస్తున్నాయి. బుంగలకు మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలి. – గోర్గంటి బాలరాజు, రైతు, నర్వ

తూములు బాగు చేయాలి



మిషన్‌ కాకతీయ కింద పాత చెరువును బాగు చేసినా తూములు మాత్రం నాసిరకంగా ఉన్నాయి. గత ఏడాది వర్షాలకు తూముల షెటర్లు, రాడ్లు వంగిపోవడంతో ఆయకట్టు పంటలకు నీళ్లు అందలేదు. తూములను బాగు చేయాలి. – గొల్ల మల్లయ్యయాదవ్‌, రైతు, నర్వ

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బడిబాట

- ప్రతి మండలంలో ఒక భవిత కేంద్రం ఏర్పాటు
- ఎంఈవోలు, ఐఈఆర్పీలకు ప్రత్యేక సూచనలు



ఆర్మూర్‌లోని భవిత కేంద్రం



కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్‌)

ఆర్మూర్‌: ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులు)ను పాఠశాలల్లో చేర్పించడానికి విద్యా శాఖ, తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ప్రణాళిక సిద్ధం చేశాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని అధికారులు సూచించిన ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారు. జూన్‌ 6వ తేదీ నుంచి 19 వరకు నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హన్మంతు పర్యవేక్షణలో డీఈవో, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి దుర్గా ప్రసాద్‌ ఆధ్వర్యంలో సెక్టోరల్‌ ఆఫీసర్స్‌ శ్రీనివాస్‌రావు క్షేత్ర స్థాయిలో కార్యాచరణను అమలు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్స్‌ (ఐఈఆర్పీ)ల సహకారంతో ముందుకు సాగుతున్నారు. గ్రామాలలో సర్వేల ఆధారంగా గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేరుస్తున్నారు.

కార్యాచరణ ఇలా..

బడిబాటలో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడుల్లో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 12న ప్రభుత్వ పాఠశాలల్లోకి, భవిత కేంద్రాల్లోకి ఆహ్వానం పలుకుతూ కార్యక్రమాలు చేపడుతారు. 15న ప్రత్యేక అవసరాలు గల పిల్లల, గర్ల్‌ చైల్డ్‌ డేను నిర్వహించనున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపించాలి



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణనిస్తూ పాఠశాలల్లో చేర్పించే విషయంలో ఐఈర్పీలతో పాటు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి. – దుర్గాప్రసాద్‌, డీఈవో, నిజామాబాద్‌

విజయవంతం చేయాలి



ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తూ ఐఈర్పీలు నిర్వహిస్తున్న బాధ్యతలు డ్యూటీగా కాకుండా సేవగా గుర్తించడతాయి. సేవా భావంతో పని చేస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. – శ్రీనివాస్‌రావు, సెక్టోరల్‌ ఆఫీసర్‌, సమగ్ర శిక్ష, నిజామాబాద్‌

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

నవీపేట: నవీపేట కుమ్మరిగల్లీలో గురువారం రాత్రి చోరీకి యత్నించిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. కాలనీకి చెందిన మల్లేశ్‌ గురువారం రాత్రి తలుపు వేసుకోకుండా ఇంట్లో పడుకున్నాడు. మద్యం మత్తుల్లో మేస్త్రీ, కూలీ ఇద్దరు ఇంట్లోకి చొరబడి మల్లేశ్‌ ప్యాంట్‌ జేబును వెతికారు. రూ.7,500 నగదును తీసుకొని వెళ్తుండగా మల్లేశ్‌ మేల్కొని ఇద్దరిలో ఒకరిని పట్టుకుని కిటికీకి కట్టేశాడు. నిందితుడిని పవన్‌గా గుర్తించారు. ఇరుగు పొరుగు వారు మేల్కొని దొంగకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

రెండు వాహనాల చోరీ

బాన్సువాడ: బాన్సువాడలో గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఓ ఫంక్షన్‌ హాల్‌ ఎదుట పార్క్‌ చేసిన స్కూటీ, ఇంటి ఎదుట నిలిపి ఉంచిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

క్రెడిట్‌కార్డు నుంచి రూ.77,604 మాయం

బాన్సువాడ: బాన్సువాడలోని కోటగల్లీకి చెందిన పత్య శ్రీనివాస్‌ క్రెడిట్‌ కార్డు నుంచి సైబర్‌ నేరగాళ్లు రూ.77,604 చోరీ చేశారు. వివరాలు.. మే 27న క్రెడిట్‌ కార్డు నుంచి డబ్బులు కట్‌ అయినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో శ్రీనివాస్‌ సైబర్‌ క్రైంకు ఫిర్యాదు చేశాడు. అంతే కాకుండా ఎస్‌బీఐ క్రెడిట్‌ కార్డును బ్లాక్‌ చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సీజ్‌ చేసిన ఎరువుల బస్తాల తరలింపు

- పట్టుకున్న ఏవో
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- విండో కార్యదర్శి నిర్వాకం



అధికారులు పట్టుకున్న డీసీఎం

రెంజల్‌: రెంజల్‌ సొసైటీలో సీజ్‌ చేసిన ఎరువులను తరలిస్తుండగా మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి శుక్రవారం పట్టుకున్నారు. విండో కార్యదర్శి రాము రైతుల వివరాలు నమోదు చేయకుండా, ఈ పాస్‌ విధానం అమలు చేయకుండా ఇష్టారీతిన ఎరువులు విక్రయించారు. దీంతో గురువారం సొసైటీలో తనిఖీ చేసిన ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి గోదాంలో నిల్వ ఉన్న 1,170 బస్తాలను సీజ్‌ చేశారు. కార్యదర్శి ఈపాస్‌ విధానం అమలు చేయకుండా అమ్మడంతో పాటు, ఎలాంటి రికార్డులు నమోదు చేయకపోవడంతో 6ఏ కేసు నమోదు చేసి చర్యల కోసం నివేదికను కలెక్టర్‌కు పంపారు. అయితే సదరు విండో కార్యదర్శి శుక్రవారం విధులకు రాకుండా సిబ్బంది ద్వారా సీజ్‌ చేసిన బస్తాల్లో నుంచి 400 బస్తాల ఎరువులను తాడ్‌బిలోలి తరలించడానికి యత్నించాడు. ఏవో అటుగా వస్తు వ్యాన్‌ను తనిఖీ చేయగా అధికారుల అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ అక్కడి నుండి పరారవడంతో రెంజల్‌ పోలీసులకు, జిల్లా అధికారులకు జరిగిన విషయాన్ని ఆయన వివరించారు. అధికారుల ఆదేశాల మేరకు ఎరువుల డీసీఎంను స్టేషన్‌కు తరలించి, కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. ఎరువుల బస్తాలను దూపల్లి సొసైటీకి అప్పగిస్తామని ఏవో తెలిపారు.

ట్రాక్టర్‌ సీజ్‌



అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌

వర్ని: మండలంలోని రాజీపేటలో అటవీ భూమిని చదును చేస్తున్న వ్యక్తిని పట్టుకొని, ట్రాక్టర్‌ సీజ్‌ చేసినట్లు వర్ని ఫారెస్ట్‌ డిప్యూటీ రేంజ్‌ ఆఫీసర్‌ బాబు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా అడవిలోకి చొరబడి ట్రాక్టర్‌ సహాయంతో భూమిని చదును చేస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. గబ్బర్‌ సింగ్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సెక్షన్‌ ఆఫీసర్లు బాసిత్‌, సాబేర్‌, శివ పాల్గొన్నారు.

52 వాహనాలు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పోలీసులు, ట్రాఫిక్‌, రవాణా శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 52 బైక్‌లను సీజ్‌ చేశారు. ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, సీఐ సురేష్‌, వెంకటనారాయణ, ఎస్సై మొగులయ్య, పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



బోధన్‌ టౌన్‌: బోధన్‌ శివారులోని చెరువు వద్ద గల పాప నాగమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభించిందని సీఐ వీరయ్య తెలిపారు. వృద్ధుడి వయసు 60–70 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: మోర్తాడ్‌ వద్ద గూడ్స్‌ రైలుకు ఎదురుగా వెళ్లి అదే గ్రామానికి చెందిన పల్దా సంతోష్‌ (20) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయి రెడ్డి తెలిపారు. సంతోష్‌ ఆత్మహత్యకు కారణాలు తెలియదన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బస్సు డ్రైవర్‌పై దాడి

రుద్రూర్‌: హారన్‌ కొట్టాడని పల్లె వెలుగు బస్సు డ్రైవర్‌పై ఒకరు దాడి చేసిన ఘటన శుక్రవారం రుద్రూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్‌ తెలిపిన వివరాలు.. బోధన్‌ డిపోకు చెందిన పల్లె వెలుగు అద్దె బస్సు బాన్సువాడ వెళ్తుండగా..రుద్రూర్‌లో ఇద్దరు రోడ్డు మధ్యలో నుంచి ఎడ్లను తీసుకెళ్తున్నారు. బస్సు డ్రైవర్‌ సాయిలు హారన్‌ కొట్టాడు. దీంతో అయాజ్‌ ఖాన్‌ అనే యువకుడు రోడ్డుపై అలాగే నిలబడి దూషించడంతో డ్రైవర్‌ సాయిలు కిందకు దిగగా అయాజ్‌ ఖాన్‌ ఆయనపై దాడి చేశాడు. కండక్టర్‌తో పాటు బస్సులోని కొందరు ప్రయాణికులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.